క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కొడంగల్ టౌన్, పర్సాపూర్, గుండ్లకుంట, పాత కొడంగల్, బూల్కాపూర్, చిట్లపల్లి, ఐనన్‌పల్లి, ఖాజా అహ్మద్ పల్లి, ఉడిమేశ్వరం, అప్పాయిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల తెరుచుకుంది!



పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయుడు

బొంరాస్‌పేట: ఏకోపాధ్యాయ పాఠశాలగా ఉన్న మండల పరిధిలోని మూడుమామిళ్లతండా ప్రాథమిక పాఠశాల ఎట్టకేలకు శనివారం తెరుచుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల కొరతతో మూడేళ్లుగా మూతబడింది. దీంతో ఇక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయురాలు సమీపంలోని రేగడిమైలారం పాఠశాలకు వెళ్లేవారు. తాజా డీఎస్సీలో వచ్చిన ఉపాధ్యాయుడు తిరుపతయ్య శనివారం పాఠశాలకు వచ్చి పాఠాలు ప్రారంభించాడు. పాఠశాలను ఎత్తివేస్తారనే తండావాసుల భావనను ఉపాధ్యాయుని నియామకంతో తొలగినట్లయ్యింది. ఈ సందర్భంగా తండా వాసులు ఎంఈఓ హరిలాల్‌ను అభినందించారు.

వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరి

ఏఈఓ అశ్విని



రైతులకు అవగాహన కల్పిస్తున్న అశ్విని

కొడంగల్ రూరల్: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఏఈఓ అశ్విని పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పర్సాపూర్ రైతువేదికలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంటల సాగు, మందుల పిచికారీ, భూ సమస్యలపై లీగల్ అవేర్‌నెస్ చేపట్టారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందేందుకు కృషిచేయాలన్నారు. రైతులు తమ సమస్యలను సిఎల్‌విల దృష్టికి తీసుకెళ్తూ న్యాయ సలహా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మంతు, దస్తప్ప, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్డీఓ వాసుచంద్ర



మాట్లాడుతున్న వాసుచంద్ర

కుల్కచర్ల: భూ సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ వాసుచంద్ర పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో సర్వేనంబర్ 208లో భూ సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశానుసారం ఆర్డీఓ వాసుచంద్ర మందిపల్ గ్రామంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడారు. ప్రతీ రైతు దగ్గరికి వెళ్లి భూ సమస్యల పరిష్కారానికి కార్యచరణను రూపొందిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాస్తులో ఉన్న రైతులందరికీ వారి ధ్రువ పత్రాలనుసరించి పట్టాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ ప్రభులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్‌నాయక్, మందిపల్ మాజీ సర్పంచ్ మఠం ప్రమీళ, చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, మఠం రాజశేఖర్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

మారని రహదారులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- నిధులు మంజూరైనా మరమ్మతులకు నోచుకోని రోడ్లు



పనులు ప్రారంభంకాని పుర్సంపల్లి రోడ్డు

కుల్కచర్ల: ప్రతీ గ్రామానికి రహదారి అత్యవసరమైనది. ముఖ్యమైనది. రహదారులు ఎంత సౌకర్యంగా ఉంటే గ్రామాలు అంత అభివృద్ధి సాధిస్తాయి. కానీ క్షేత్రస్థాయిలో నేటికీ కొన్ని ప్రాంతాల్లో రహదారులు పరిస్థితి మారలేదు. అవి ఇంకా దారుణంగా తయారవుతున్నాయి. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రజల అవస్థలు మాత్రం మారడం లేదు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లోని రహదారులు ఇబ్బందికరంగా తయారైంది. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

సంవత్సరాల తరబడి పనులు పెండింగ్‌లోనే....

చౌడాపూర్ పరిధిలోని మరికల్ వయా కల్మన్‌కాల్వ నుంచి మహ్మదబాద్ వరకూ ఎన్నో సంవత్సరాల నుంచి గుంతలుగా ఉంది. ఈ విషయం లో సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పులు రావడం లేదు. అదే గుంతల రోడ్డుపై ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది.



గుంతలమయంగా మరికల్ కల్మన్‌కాల్వ రోడ్డు

బీటీరోడ్లకోసం ఎదురుచూపులు

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు తమ గ్రామానికి రహదారి లేక బీటీరోడ్డుకోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మరికల్ నుంచి కల్మన్‌కాల్వ, కొత్తపల్లి, మల్కాపూర్, పుర్సంపల్లి, పటేల్ చెరువు తండా, అనంతసాగర్, చెరువుముందలి తండా(ఎ), ఈర్లవాగు తండా, చౌడాపూర్ నుంచి విఠలాపూర్ గ్రామానికి బీటీరోడ్డు మంజూరై ఏళ్ల గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గుంతల రోడ్లపై పలుమార్లు రోడ్డుప్రమాదాలు సంభవించాయి.

సంవత్సరాలు గడుస్తున్నా..



మరికల్ నుంచి కల్మన్‌కాల్వ వెళ్తున్నక్రమంలో బీటీరోడ్డుపై ఎన్నో గుంతలు పడి రహదారి ప్రమాదకరంగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఈ రోడ్లగుండా ప్రయాణం చేయాలంటే నరకమే అనుభవిస్తున్నాం.

– విజయ్‌కుమార్, కల్మన్‌కాల్వ, వాహనదారుడు

త్వరితగతిన పనులు ప్రారంభించాలి



రోడ్డు మంజూరైందని అధికారులు ఎన్నోమార్లు చెబుతున్నప్పటికీ రోడ్డుపనులు మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. వర్షాకాలం వస్తే నడవడానికి ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రోడ్లను అభివృద్ధి చేయాలి. బురదమయంగా తయారవుతున్న రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రమాదాల బారిన పడుతున్నాం. సత్వరమే పనులు ప్రారంభించాలి.

– శ్రీనివాస్, పుర్సంపల్లి, వాహనదారుడు

రైతుల సంక్షేమమే ధ్యేయం

పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య



ఆంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన ఆంజనేయులును సహకార సంఘం పాలకవర్గం, బండవెల్కిచర్ల గ్రామ రైతుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతాంగ అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల సమస్యలు తెలిసిన వ్యక్తులను వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్‌లుగా నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతాంగ సమస్యలపై గతంలో పోరాటం చేసిన వారికి పదవులు ఇవ్వడం పట్ల రైతు సంఘాల నాయకులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో రైతుల అభ్యున్నతికి మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకువచ్చి వారి అభివృద్ధికి కృషిచేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, బండవెల్కిచర్ల గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, కోట్ల మైపాల్ రెడ్డి, పిల్లి నారాయణ, ప్రభాకర్, ఎల్లప్ప, కూర చెన్నప్ప, నర్సింలు, రాములు, చిన్నారెడ్డి, హన్మంతు, నరసింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, చంద్రయ్య, చిన్నయ్య, మాసగల్ల రాములు పాల్గొన్నారు.

మాలల అభ్యున్నతికి కృషి



నూతన కమిటీ సభ్యులతో జిల్లా కార్యవర్గం

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య

పరిగి: మాలల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో మాల మహానాడు డివిజన్, పట్టణ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా గడిసింగాపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, అధికార ప్రతినిధిగా యాదయ్య, పట్టణ అధ్యక్షుడిగా బేగరి చందు, ఉపాధ్యక్షుడిగా రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా నందు ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వెంకటయ్య మాట్లాడారు. ప్రతిఒక్కరూ సంఘటితంగా ఉండాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మాలలకు దక్కాల్సిన హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజశేకర్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తెలివి వెపన్ కన్నా మిన్న

ఎస్‌ఐ గిరి



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గిరి

పెద్దేముల్: విద్యార్థుల తెలివి వెపన్ కన్నా మిన్న అని పెద్దేముల్ ఎస్‌ఐ గిరి పేర్కొన్నారు. శనివారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు పాఠశాలల విద్యార్థులకు వెపన్, న్యాయ చట్టాలు, కోర్టులు, 1098, 100 డయల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌ఐ గిరి మాట్లాడారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని చదువుకోవాలన్నారు. కష్టపడి చదివితే విజయం సాధించ గలరన్నారు. 303 మస్కట్, 7.62 ఎంఎం ఎస్‌యల్‌ఆర్, 9ఎంఎం కార్ బైన్, 9ఎంఎం పిస్టల్, 7.62 ఎంఎం ఇన్‌సాస్ వెపన్‌లపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే దరఖాస్తు దారులను ఎలా రిసిప్ చేసుకోవాలి? దరఖాస్తు ఎలా ఇవ్వాలి? పోలీస్ స్టేషన్‌లో ఎవరెవరు అందుబాటులో ఉంటారు? ఎఫ్‌ఐఆర్, క్రిమినల్, సివిల్ కేసులు అంటే ఏమిటి? విద్యార్థులు ఆపదలో ఉన్న సమయంలో ఏ నెంబర్‌కు ఫోన్ చేయాలి? 1098, 100, 181 కాల్‌పై ఎలాంటి సమస్యలు పరిష్కారం అవుతాయన్న దానిపై సెక్షన్ ఇన్‌చార్జి, కోర్టు ఇన్‌చార్జిలు విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం చివరి సమయంలో విద్యార్థులకు వెపన్‌లను చూపించారు.

పోలీసులంటే భయం వీడాలి



తాండూరు రూరల్: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: పోలీసులంటే భయం వీడాలని విద్యార్థులతో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కరన్‌కోట్ పోలీస్ ఎస్టేషన్‌ను గౌతపూర్‌లోని మారుతి స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. పోలీస్ విధులపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పోలేపల్లి గ్రామానికి నిధుల మంజూరు

దుద్యాల్: పోలేపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనంలో తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం, పోలేపల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయం దగ్గర మూత్రశాలల ఏర్పాటు గురించి కడా అధికారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వాటి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఇటీవల విడుదలైన నిధుల నుంచి నూతన పాఠశాల భవన నిర్మాణం, పాఠశాల ప్రహరీ, వంటశాలకు రూ.1కోటి 25లక్షలు, రేణుక ఎల్లమ్మ దేవాలయం దగ్గర మూత్రశాలల నిర్మాణానికి రూ.18లక్షల 50వేలు ఖర్చు చేయనున్నారు. ప్రభుత్వం పోలేపల్లి గ్రామానికి నిధులు కేటాయించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు

డీఆర్‌డీఓ శ్రీనివాస్



ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

నవాబుపేట: ఉపాధిహామీ పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి, 2024 మార్చి 31 వరకు నిర్వహించిన పనులపై వారం రోజులుగా తనిఖీ బృందాలు సామాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీలో బయటపడ్డ అక్రమాలను అధికారుల ఎదుట చదివి వినిపించారు. చాలా గ్రామాల్లో కూలీల సంతకాలు లేకుండానే పేమెంట్లు చేయడం, చెల్లించిన పేమెంట్లకు రికార్డులు లేకపోవడం, ఆశావర్కర్లకు పేమెంట్లు చేయడం, ప్రజా ప్రతినిధులు పనులకు రాకున్నా వారి పేర్ల మీద పేమెంట్లు చేసినట్లు, నాటని మొక్కలకు బిల్లులు చెల్లించడం, తక్కువగా చేసిన పనులకు ఎక్కువగా బిల్లులు చెల్లించడం, కూలీల సంతకాలు లేకుండానే పేమెంట్లు చేయడం, అధిక పనులు చేసిన వారికి తక్కువ కూలీ వచ్చేలా పేమెంట్లు చేశారని ప్రజావేదికలో వెల్లడించారు.

లక్షల్లో అక్రమాలు.. రికవరీ తక్కువ

సామాజిక తనిఖీలో లక్షల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రజా వేదికలో వెల్లడించారు. కానీ అధికారులు మాత్రం చాలా అక్రమాలను కప్పి పుచ్చుతూ రికవరీ తక్కువ రాయడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తుంది. ఉపాధి హామీ సిబ్బంది అక్రమాలను కప్పిపుచ్చి కూలీలు చేసిన తప్పులనే రికవరీకి రాసినట్లు పలువురు పేర్కొన్నారు. సిబ్బంది అక్రమాలను అధికారులు దాటవేశారని పలువురు తెలిపారు.

ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేస్తే ఆందోళన చేస్తాం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘం నాయకులు

దళిత సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్

పెద్దేముల్: మాదాసి మాదిరి కుర్వకులానికి ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేస్తే ఆందోళన చేస్తామని పెద్దేముల్ మండల దళిత సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్ హెచ్చరించారు. శనివారం దళిత సంఘం అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో మాదాసి మాదిరి కుర్వ కులానికి చెందిన కొందరు ఎస్సీ సర్టిఫికెట్‌కోసం దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. మండలంలో మాదాసి కుర్వ ఎస్సీ కులస్తులు ఎవరూ లేరన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఆదేశాలు గానీ, జీవో గానీ జారీ చేయలేదన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేసి దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం సభ్యులు మంబాపూర్ కిరణ్, రాములు, శ్రీనివాస్, ప్రశాంత్, ఆనంద్, బాలప్ప, అనిల్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ప్రమాణాలు పాటించాలి



వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి ప్రణీత్

తాండూరు రూరల్: నీటి సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ సాయి ప్రణీత్ పేర్కొన్నారు. శనివారం రెండోరోజు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల వాటర్‌మెన్‌లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడారు. ప్రతి ఇంటికి మిషన్ భగిరథ నీరు సరఫరా చేయాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడైన పైప్‌లైన్ పగిలితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేసి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. అనంతరం పైప్‌లైన్ మరమ్మతులు, నల్లాకనెక్షన్లకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగిరథ గ్రిడ్ ఏఈ ప్రతిభ, నూతన ఏఈలు వెంకట్, ధీరజ్, ఎంపీఓ ఆనంద్‌రావు, ట్రైనర్ రాములు, ఆయాగ్రామాల వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

మార్వాడీ యువమంచ్ సేవలు అభినందనీయం



యువమంచ్ ప్రతినిధులతో విద్యార్థులు

యాలాల: మార్వాడీ యువమంచ్ సేవలు అభినందనీయమని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జీహెచ్‌ఎం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కోకట్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తాండూరు మార్వాడీ యువమంచ్ ప్రతినిధులు దీపావళి సందర్భంగా స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మార్వాడీ యువమంచ్ జాతీయ సంఘం మాజీ సభ్యుడు మన్మోహన్ సార్డా మాట్లాడారు. ఆనంద్ సబ్‌కేలియే కార్యక్రమంలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తాము సంపాదించే ఆదాయంలో కొంత మొత్తం పేద, మధ్య తరగతి అవసరాలకు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువమంచ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు నెహ్రూచౌహాన్, షఫీ, అనంత నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ

- నేటికీ ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- ఆందోళనలో రైతన్నలు
- పట్టించుకోని అధికారులు



కోతకు సిద్ధంగా ఉన్న పొలం



వరిపొలం కోస్తున్న హార్వెస్టర్

దౌల్తాబాద్: వరి చేతికి రావడంతో రైతులు కోతలను షురూ చేశారు. మండలంలో నేటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధర ప్రకటించినా...

ఈ సంవత్సరం వరి పంటను రైతులు అధికంగా సాగు చేశారు. అక్టోబర్ నుంచి నవంబర్ మధ్య వరికోతలు జోరందుకుంటాయి. ప్రస్తుతం ముందస్తుగా సాగు చేసిన పంటలు చేతికందాయి. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,300ల మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభిస్తే రైతులకు మద్దతు ధర దక్కుతుంది. కొనుగోలు కేంద్రాలు ఉంటే వ్యాపారులు సైతం అందుకు అనుగుణంగా ధరను చెల్లించి కొనుగోలు చేస్తారు. కొనుగోలు కేంద్రాలు లేకపోతే వ్యాపారులు ధరను తగ్గించి రైతులను మోసం చేసే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీసారి ఆలస్యంగానే...

గతంలో ఐకేపీ, కోఆపరేటివ్ సహకార సంఘం పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూడా అవే కొనుగోలు కేంద్రాలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రతీ సంవత్సరం ఆలస్యంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆలస్యంగా మూసివేస్తున్నారు. దీంతో రైతులు వ్యాపారులకు, దళారులకు వరి ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు.

సకాలంలో ఏర్పాటు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం సకాలంలో ఏర్పాటు చేయాలి. లేదంటే రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. అకాల వర్షాలు వస్తే రైతులు నష్టపోతారు. అధికారులు ఈ విషయంలో స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– నారాయణ, రైతు, సలీంపూర్

సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**

యాలాల: జుంటుపల్లి గ్రామానికి చెందిన అనంతమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామ నాయకుడు, మృతురాలి కొడుకు మంతటి బసప్పను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నర్సిరెడ్డికి నివాళి**

బొంరాస్‌పేట: రేగడిమైలారంలో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గుర్మిట్‌కల్ నర్సిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశ్, నర్సింలునాయుడు, కిష్టప్ప, రాములు, చంద్రప్ప, గుండప్ప, ప్రసాద్‌గౌడ్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **విరాళం**

దౌల్తాబాద్: మండల కేంద్రంలో శివాజీ విగ్రహా ప్రతిష్ఠాపనకు మాటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోట్లహన్మంతు రూ.50వేలు, దౌల్తాబాద్ మాజీ ఎంపీటీసీ రూ.11వేలు విరాళం అందజేశారు.

◆ **శాలివాహన డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే**

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని శాలివాహన డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం తులసి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రెసిడెంట్ కల్వ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

◆ **రాష్ట్ర కో ఆర్డినేటర్లను కలిసిన నాయకులు**

తాండూరు టౌన్: తాండూరు బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు రాష్ట్ర కో ఆర్డినేటర్లు శేఖర్, ఈశ్వర్‌లను శనివారం మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి బోయిని చంద్రశేఖర్ మాట్లాడారు. సత్యమూర్తి, అమ్జద్, నరేందర్, ప్రవీణ్, మహేందర్, కృష్ణయ్య గౌడ్, పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ కార్గోహోం డెలివరీ**

పరిగి: ఆర్టీసీ కార్గోద్వారా పార్సిల్స్‌ను హైదరాబాద్ జంట నగరాల్లో హోం డెలివరీ చేస్తున్నట్టు ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి హోం డెలివరీ ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద మొదట హైదరాబాద్‌లో ప్రారంభించి రాష్ట్రంలో విస్తరింపజేస్తామని తెలిపారు.